ఐఐఎంలూ, దేశంలోని టాప్ బీ స్కూల్స్‌లో ఎంబీఏ ప్రవేశాల కోసం మౌఖిక పరీక్ష, బృంద చర్చ/ గ్రూప్ ఎక్సర్‌సైజు, రిటన్ ఎబిలిటీ టెస్టులు ఆరంభమవుతున్నాయి. క్యాట్- 2023, జాట్ లాంటి జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల్లో కనీస కటాఫ్‌లు సాధించిన గ్రాడ్యుయేషన్ అభ్యర్థులు వీటికి అర్హులు. ప్రవేశపరీక్షల స్కోరుకు 25- 50 శాతం మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. దీనితో పాటు మౌఖిక పరీక్షల్లో ప్రతిభ, ప్రొఫైల్ స్కోరుల ఆధారంగానే ప్రసిద్ధ విద్యాసంస్థల్లో మేనేజ్‌మెంట్ సీట్లు లభిస్తాయి.

ఎంబీఏ ఇంటర్వ్యూలు... ఎదుర్కోవడం ఎలా?

సాధారణంగా ఇంటర్వ్యూలు ఒక్కో అభ్యర్థికి 15-30 /40 నిమిషాల పాటు నిర్వహిస్తారు. 10 నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ప్యానలిస్టులుగా 2-5 మంది సభ్యులు (పురుషులు, మహిళలు) ఉంటారు. ప్రముఖ ఐఐఎంలు/ బీ స్కూల్స్ ఆఫ్-లైన్‌లోనే మౌఖిక పరీక్షలను నిర్వహిస్తాయి.

విద్యార్థులను అడిగే ప్రశ్నలు రెండు రకాలు. 1. స్వీయ పరిజ్ఞానం: అభ్యర్థి చదువు, అర్హతలు, కుటుంబ నేపథ్యం, హాబీలు, సొంత ప్రదేశం, జీవిత లక్ష్యాలు మొదలైనవి. 2. జనరల్ అవేర్‌నెస్: కరెంట్ అఫైర్స్, ఆర్థిక వ్యవస్థ, పాలిటిక్స్ మొదలైనవి.

గతంలో తరచుగా ఐఐఎంలు ప్రశ్నలు అడిగిన అంశాలు

- స్వీయ పరిచయం చేసుకోండి. (మిమ్మల్ని మీరు 30 సెకండ్లలో పరిచయం చేసుకోండి /మీ రెజ్యూమెలో మీ గురించి లేనిదాన్ని చెప్పండి. మీ బలాలు, బలహీనతలు ఏమిటి అనీ ప్రశ్నించొచ్చు).
- ఎందుకు ఎంబీఏ చెయ్యాలనుకొంటున్నారు? (ఎంబీఏలో ఏ స్పెషలైజేషన్ మీకు ఇష్టం?, ఈ కాలేజీ ఎంచుకోవడానికి ప్రధాన కారణం?)
- మీ కెరియర్ లక్ష్యాలను వివరించండి (స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు)
- మిగతావారితో పోల్చితే మీకే ఈ ఎంబీఏ అడ్మిషన్ ఇవ్వడానికి మీకున్న ప్రత్యేక అర్హతలు ఏమిటి?
- మీ జీవితంలో ప్రముఖ సంఘటనలు/ విజయాలు ఏవి? (మీ నాయకత్వ లక్షణాలకు ఉదాహరణలు? మీ జీవితంలో ఎప్పుడైనా విఫలమయ్యారా? ఎలా అధిగమించారు?
- మీ పేరుకు ఉన్న అర్థం? మీ ఊరు ప్రత్యేకతలు ఏమిటి?

మౌఖిక పరీక్షలో ఏం గమనిస్తారు?

1. కమ్యూనికేషన్ స్కిల్స్, తార్కిక జ్ఞానం
2. బృంద నైపుణ్యాలు
3. నాయకత్వ లక్షణాలు
4. మేనేజ్‌మెంట్ విద్యపై కనీస పరిజ్ఞానం
5. తమ గ్రాడ్యుయేషన్ సబ్జెక్టుల ప్రాథమికాంశాలపై పట్టు

పాలిటీ: మీ రాష్ట్ర గవర్నర్ / మీ రాష్ట్ర ఆర్థిక మంత్రి ఎవరు? దేశంలో ఎన్ని జిల్లాలు ఉన్నాయి? అమెరికాలో ఏ పార్టీ అధికారంలో ఉంది? పాకిస్తాన్ ప్రధాన మంత్రి / మైనా ప్రెసిడెంట్ ఎవరు? భారత్‌కు విదేశాలతో ఉన్న సంబంధాలు? ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం..

ఎకానమీ: ఒకవేళ మీరు నిర్మలా సీతారామన్‌ని కలిసే అవకాశం వస్తే కొత్త బడ్జెట్‌పై ఎటువంటి సలహాలు ఇస్తారు? జీడీపీ, జీఎన్‌పీ, ద్రవ్యోల్బణం, ఆర్‌బీఐ పాలసీలు, ఆర్థిక మాంద్యం, బ్యాంకింగ్, పన్నులు- భావనలపై ప్రశ్నలు...

టెక్నాలజీ: చాట్ జీపీటీ, ఏఐ, బిజినెస్ అనలిటిక్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ భావనలపై ప్రశ్నలు..

మేనేజ్‌మెంట్ సబ్జెక్టు: ప్రాథమిక భావనలు, మార్కెటింగ్, ఆపరేషన్స్, మానవ వనరులు, ఆర్గనైజేషనల్ బిహేవియర్, కన్సల్టింగ్...

బృంద చర్చలు

సమకాలీన అంశాలపై లేదా మేనేజ్‌మెంట్/ ఇతర సబ్జెక్టులపై టాపిక్ ఇచ్చి కొంతమంది అభ్యర్థులను గ్రూపులుగా విభజించి చర్చించమని చెపుతారు. ఇచ్చిన అంశాన్ని అర్థం చేసుకొని, చర్చను మీరే ప్రారంభిస్తే ఒక సానుకూలాంశం అవుతుంది. అయితే ఇచ్చిన అంశంపై అవగాహన ఉంటేనే ప్రారంభించడం మంచిది. లేకుంటే ఇతరులు మాట్లాడుతున్నది సావధానంగా విని అర్థం చేసుకోవాలి. వారు చెప్పిన అభిప్రాయాల ఆధారంగా ప్రతిస్పందించాలి. వాదనలకు దిగరాదు. ఇక్కడ మీ లిసనింగ్ నైపుణ్యాలు, బృంద, నాయకత్వ లక్షణాలను అంచనా వేస్తారు.

ఎలాంటి టాపిక్‌లు అడగవచ్చు?

ఆబ్‌స్ట్రాక్ట్ టాపిక్స్: ఇవి వినూత్నంగా ఉంటాయి. సృజనాత్మకతకు పరీక్ష పెడతాయి. ఉదాహరణకు రెడ్ వర్సెస్ గ్రీన్, మైథాలజీ వర్సెస్ మేనేజ్‌మెంట్, జీరో వర్సెస్ శూన్య.

జనరల్ అవేర్‌నెస్ టాపిక్స్: ఇవే టాపిక్స్, వ్యాస పరీక్ష (ఎస్సే)కు కూడా ఉపయోగపడతాయి. మూన్ లైటింగ్, ఏఐతో ఐటీ జాబ్స్‌కు ముప్పు, లే ఆఫ్స్ (ఉద్యోగుల తొలగింపు), 2024 ఎన్నికలు, ఇండియా వర్సెస్ భారత్, చాట్ జీపీటీతో సృజనాత్మకతకు ముప్పు, డీప్ ఫేక్, సోషల్ మీడియాలో నెగెటివిటీ.

గ్రూప్ ఎక్సర్‌సైజులు

ఇప్పుడు బృంద చర్చలకు బదులు వీటిని అడుగుతున్నారు. వీటిలో రోల్ ప్లే, ప్రాజెక్ట్ ప్రతిపాదనలు, కేస్ స్టడీ వంటి వాటిపై ఒకే గ్రూప్‌గా చర్చించాల్సి వస్తుంది. ఇచ్చిన టాస్క్‌ను బట్టి ఒక్కొక్క సభ్యుడికి ఒక్కో పనిని అప్పగించాలి/ విభజించాలి. ఇదే టీం వర్క్ అంటే. వీటిలో బృందచర్చలో కనబరిచే లక్షణాలతో పాటు అభ్యర్థి సహకారం, సంప్రదింపులు, ఒప్పించే నైపుణ్యాలు పరీక్షిస్తారు. గ్రూప్ డిస్కషన్ లాగా కాకుండా చర్చ చివరలో అందరూ ఏకాభిప్రాయానికి రావాలి కూడా. **కొన్ని టాపిక్స్:** మీ గ్రూప్ వారు మారుమూల గ్రామానికి వెళ్లి, అక్కడి నిరక్షరాస్య మహిళలకు సెర్వికల్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి/ ప్రస్తుత ట్రెండింగ్ అంశం రిమోట్ వర్కింగ్ వల్ల లాభ నష్టాలు?

జవాబులు ఎలా చెప్పాలి?

అభ్యర్థులు సమాధానాలను మూస పద్ధతిలో కాకుండా సృజనాత్మకంగా చెప్పడానికి సన్నద్ధులు అవ్వాలి. ఉదాహరణకు **'సెల్ఫ్ ఇంట్రడక్షన్'** ప్రశ్నకు కేవలం రెజ్యూమెలోనిది వున్నది ఉన్నట్లు అప్పచెప్పకుండా స్కూలింగ్ నుండి డిగ్రీ వరకు తనకున్న విజయాలు, నేర్చుకున్న నైపుణ్యాలు, సానుకూల దృక్పథంతో కూడిన తన వ్యక్తిత్వం గురించి చెప్పాలి. **ఎందుకు ఎంబీఏ చెయ్యాలనుకొంటున్నారు?** అనే ప్రశ్నకు- మేనేజ్‌మెంట్ వైపు మరలడానికి ప్రేరణ ఎలా వచ్చింది (వ్యాపార కుటుంబ నేపథ్యం ఉంటే దాన్ని చెప్పవచ్చు), ఎంబీఏ చేస్తే ఎలాంటి నైపుణ్యాలు మీరు అలవరచుకొంటారు? కాలేజీ ద్వారా నెట్ వర్కింగ్ పెంచుకోవడం, ఫ్యాకల్టీతో సత్సంబంధాలు, స్టూడెంట్ క్లబ్స్‌తో మమేకం లాంటి వాటి ద్వారా మీ దీర్ఘకాలిక కెరియర్ లక్ష్యాలను నెరవేర్చడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుందనేది జవాబులో జతపరిచి ఆత్మవిశ్వాసంతో చెప్పాలి. అంతే కానీ, 'ఈ ఎంబీఏ ద్వారా మంచి కంపెనీలో నాకు జాబ్/ మంచి శాలరీ వస్తుందని ఆశిస్తున్నాను' లాంటి పేలవమైన సమాధానాలు సరి కావు. ఇదే ప్రశ్నకు పని అనుభవం ఉన్న అభ్యర్థులు తమ కంపెనీలో ఇంతవరకు ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించడం కోసం ఈ ఎంబీఏ ఒక పరిష్కారంగా చెప్పుకోవచ్చు.

15-30 నిమిషాల ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థిపై మంచి ముద్ర పడాలంటే పైన చెప్పిన ప్రశ్నలకు సరైన సమాధానాలను నోట్ బుక్‌లో రాసి, వాటిని కొన్ని నమూనా ఇంటర్వ్యూల ద్వారా సాధన చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇంటర్వ్యూ అనగానే చాలా మందిలో 'ఒత్తిడి' ప్రభావం చూపుతుంది. దాన్నుంచి బయటపడాలంటే పైన చెప్పిన రెగ్యులర్ ప్రశ్నలకు రెడీమేడ్ సమాధానాలు ఉంటే, ఇంటర్వ్యూ సమయంలో ఆత్మ విశ్వాసంతో ఉండొచ్చు. తర్వాత ఏవైనా కొత్త ప్రశ్నలు తలెత్తినా సులువుగా ఎదుర్కొనవచ్చు. మొత్తం మీద విషయ పరిజ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసం, చిరునవ్వు, సమయస్ఫూర్తి, తార్కిక జ్ఞానం, సానుకూల దృక్పథం జత అయితే ఐఐఎం/ బీ స్కూల్ ఇంటర్వ్యూ నెగ్గడం సులభమే.

రిటన్ ఎబిలిటీ టెస్టు

రాత నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనా సామర్థ్యం, భావ వ్యక్తీకరణలను అంచనా వేసే వ్యాస రచన పరీక్ష. ఇచ్చిన అంశంపై 15-20 నిమిషాల్లో 250-300 పదాలతో వ్యాసం రాయాలి. వీటిలో విషయం పరిజ్ఞానం, విశ్లేషణ, తార్కిక ఆలోచన, వ్యాస నిర్మాణం, పదజాలం, ఇంగ్లిష్ వ్యాకరణం కీలక పాత్ర పోషిస్తాయి కాబట్టి పైన చెప్పిన టాపిక్స్, కరెంటు అఫైర్స్‌పై అవగాహన పెంచుకొని, కొన్ని నమూనా టాపిక్స్ సాధన చేస్తే ఈ టెస్టులో మంచి స్కోరు చెయ్యవచ్చు.

ఐఐఎం అహ్మదాబాద్ కొత్తగా అనలిటికల్ రైటింగ్ టెస్ట్ ఇస్తోంది. దీనిలో క్రిటికల్ రీజనింగ్‌తో కూడిన ప్రశ్నలు ఇచ్చి వాటిలో దాగివున్న అంశాలను పైకి తీసుకురావడం/ ఫలానా వాదనను బలపరచండి లేదా బలహీనపరచండి / దానికి సరైన ముగింపు అడగవచ్చు. ఈ వాదనతో మీరు ఏ విధంగా ఏకీభవిస్తారు / విభేదిస్తారు? అనీ అడగవచ్చు. ఒక్కోసారి ఒక బొమ్మ చూపించి, దానిపై ప్రశ్నలు అడుగుతారు.

మొత్తం మీద- సన్నద్ధతకు మించిన తరణోపాయం మరొకటి లేదు. పైన చెప్పిన సలహాలు పాటిస్తూ పటిష్ఠంగా సాధన చేస్తే ఐఐఎంల్లో, టాప్ బీ స్కూల్స్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్స్ / రిటన్ ఎబిలిటీ టెస్టుల్లో నెగ్గి ఈ 2024లో మీ కలకల కాలేజీలో సీటు సంపాదించవచ్చు!

– శ్రీధర్,
డైరెక్టర్, కౌటిల్య, తిరుపతి

పర్యావరణ సమతుల్యానికి కీలకం అడవులే. ఉన్నవాటిని పరిరక్షించి, కొత్తగా వృద్ధి చేయడం, అటవీ ఉత్పత్తులకు విలువను జోడించడానికి నిపుణుల సేవలు తప్పనిసరి. ఇందుకోసం దేశంలో ప్రత్యేకంగా కొన్ని సంస్థల ఆధ్వర్యంలో కోర్సులు అందిస్తున్నారు. దేహ్రాదూన్‌లోని ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అలాంటిదే. ఇక్కడ పలు పీజీ కోర్సులు నడుపుతున్నారు. వాటిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది!

పిలుస్తోంది... ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

అడవులపై సమగ్ర అవగాహన కలిగించి, నైపుణ్యం ఉన్న మానవ వనరులను సమగ్రంగా తీర్చిదిద్దడానికి దేహ్రాదూన్‌లో ఎఫ్ఆర్ఐ నెలకొల్పి, కోర్సులు అందిస్తున్నారు. అలాగే అటవీ ఉత్పత్తులైన కలప మొదలైనవి సమర్థంగా ఉపయోగించడంపైనా మెలకువలు నేర్పుతున్నారు. వృక్ష సంపదను వృద్ధి చేయడానికి అనుసరించాల్సిన పద్ధతులు, విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ కోర్సులు చదివినవారు సంబంధిత విభాగాల్లో అవకాశాలు అందుకుంటున్నారు. పరీక్షలో ప్రతిభతో ప్రవేశాలుంటాయి.

ఏ కోర్సు? ఎన్ని సీట్లు?

ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ

సీట్లు: 43

అర్హత: బోటనీ/ కెమిస్ట్రీ/ జియాలజీ/ మ్యాథ్స్/ ఫిజిక్స్/ జువాలజీ/ అగ్రికల్చర్/ ఫారెస్ట్రీ వీటిలో ఏదైనా ఒక సబ్జెక్టుతో బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులో: అడవులను ఎలా పరిరక్షించాలి, ఎదురవుతోన్న ఇబ్బందులు, పట్టణాల్లో పచ్చదనం పెంచడం, వృక్షాలకు వచ్చే వ్యాధులు-నివారణ, అడవులను వృద్ధి చేయడమెలా..తదితర అంశాలను తెలుపుతారు. వీరికి ప్రభుత్వ సంస్థల్లో, ఎన్జీవోల్లో అవకాశాలుంటాయి.

ఎమ్మెస్సీ వుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ

సీట్లు: 43

అర్హత: 50 శాతం మార్కులతో ఎంపీసీ గ్రూపులో బీఎస్సీ లేదా బీఎస్సీ ఫారెస్ట్రీ ఉత్తీర్ణత

కోర్సులో: కర్ర/చెక్కను వివిధ ఉత్పత్తుల్లో, తయారీలో ప్రభావంతంగా ఎలా ఉపయోగించవచ్చో తెలుసుకోవచ్చు. వృక్ష ధర్మాలు, కర్ర, చెక్కలను ఎలా పరిరక్షించాలో నేర్పుతారు. వీరికి చెక్క ఆధారిత తయారీ సంస్థల్లో అవకాశాలు లభిస్తున్నాయి.

ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్

సీట్లు: 43

అర్హత: 50 శాతం మార్కులతో బేసిక్/అప్లయిడ్ సైన్సెస్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఎస్సీ ఫారెస్ట్రీ/అగ్రికల్చర్ లేదా బీఈ/బీటెక్ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ చదివుండాలి.

కోర్సులో: వీరు పర్యావరణ సమస్యలు, వాటిని అధిగమించే విధానాలపై దృష్టి సారిస్తారు. వాతావరణ మార్పులు, జీవ వైవిధ్యం, అటవీకరణ విధానాలను తెలుసుకుంటారు. ప్రపంచానికి ఎదురవుతోన్న పర్యావరణ సమస్యలకు పరిష్కారాలను అధ్యయనం చేస్తారు. వీరికి ప్రభుత్వ సంస్థలు, ఎన్జీవోలు, కార్పొరేట్ సంస్థల్లో అవకాశాలుంటాయి.

ఎమ్మెస్సీ సెల్యులోజ్ అండ్ పేపర్ టెక్నాలజీ

సీట్లు: 26

అర్హత: కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా సైన్స్ డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా 50 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ కెమికల్/ మెకానికల్ ఇంజినీరింగ్.

కోర్సులో: వృక్షాల నుంచి కాగితం తయారీకి సంబంధించిన విషయాలను వీరు అధ్యయనం చేస్తారు. సాంకేతికతను ఉపయోగించి, తక్కువ వృథాతో పెద్ద మొత్తంలో కాగితాన్ని ఎలా ఉత్పత్తి చేయవచ్చో తెలుసుకుంటారు. వీరికి కాగిత పరిశ్రమ, వస్తు తయారీ, ప్యాకింగ్ సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. రెండో ఏడాది కోర్సులో భాగంగా వీరు సెంట్రల్ పల్ప్ అండ్ పేపర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీపీఆర్ఐ), సహరాన్‌పూర్‌లో చదువుతారు.

పై అన్ని కోర్సులకూ ప్రస్తుతం యూజీ చివరి ఏడాది చదువుతున్నవారూ అర్హులే. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సరిపోతుంది. ఒకటి కంటే ఎక్కువ కోర్సుల్లో చేరాలనుకున్న వారు కోర్సులవారీగా విడిగా దరఖాస్తు, ఫీజు చెల్లించాలి.

పరీక్ష ఇలా..

ఆబ్జెక్టివ్ తరహాలో 200 ప్రశ్నలుంటాయి. వీటిని 4 విభాగాల్లో అడుగుతారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

1. సైన్స్, సోషల్ సైన్స్‌లో ప్రాథమికాంశాల నుంచి 100 ప్రశ్నలు
2. అరిథ్‌మెటిక్, క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, కంప్యూటేషనల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, టేబుల్స్, గ్రాఫ్స్ ఇంటర్‌ప్రిటేషన్‌లో 40
3. జనరల్ నాలెడ్జ్, కరంట్ అఫైర్స్ నుంచి 30
4. ఇంగ్లిష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్, వొకాబ్యులరీ, గ్రామర్, ఇడియమ్స్.. మొదలైనవాటి నుంచి 30 ప్రశ్నలు వస్తాయి.

ప్రతి ప్రశ్నకూ 4 ఆప్షన్లు ఇస్తారు. వాటిలో సరైనది గుర్తించాలి. ప్రతి తప్పు సమాధానానికీ ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో నాలుగో వంతు తగ్గిస్తారు.

ముఖ్య వివరాలు

దరఖాస్తు: యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు వివరాలు నింపి, డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రార్, ఎఫ్ఆర్ఐ, దేహ్రాదూన్ పేరుతో రూ.1500 ఫీజు డీడీ జతచేసి పోస్టులో పంపాలి.

చిరునామా: రిజిస్ట్రార్, ఎఫ్ఆర్ఐ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, దేహ్రాదూన్-248195 **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 8.

ఆన్‌లైన్ రిమోట్ ప్రొక్టర్డ్ పరీక్ష తేదీ: మే 19.

వెబ్‌సైట్: http://fridu.edu.in/

ఈ కోర్సు పూర్తిచేస్తే...

బీటెక్, ఎంబీఏ రెగ్యులర్‌గా పూర్తిచేశాను. ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రంలో రెండేళ్ల ఆన్‌లైన్ ఎంఏ ఎకనామిక్స్ కోర్సులో ప్రవేశం పొందాను. ఈ కోర్సు పూర్తిచేస్తే.. ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీకీ, ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్ పరీక్షకూ అవకాశం ఉంటుందా? - ఐశ్వర్య

■ ఆంధ్రా యూనివర్సిటీకి న్యాక్ గ్రేడింగ్ ఆధారంగా యూజీసీ గ్రేడ్‌వన్ అటానమస్ హోదా కల్పించారు. దీనివల్ల యూనివర్సిటీకి కొత్త కోర్సుల రూపకల్పనకు అవసరమైన స్వయంప్రతిపత్తి ఉంటుంది. ఏదైనా యూనివర్సిటీ నిర్వహించే దూరవిద్య, ఆన్‌లైన్ ప్రోగ్రాంలకు యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) అనుమతి తప్పనిసరి. సాధారణంగా, ప్రభుత్వ యూనివర్సిటీలు జారీచేసే డిగ్రీల విషయంలో నియామక సంస్థలకు ఎలాంటి అనుమానాలూ ఉండవు. ఏదైనా పోటీ పరీక్షకు డిగ్రీ అనేది ఒక విద్యార్హత మాత్రమే. రాత పరీక్షలో, ఇంటర్వ్యూలో చూపే ప్రతిభపైనే మీ ఉద్యోగావకాశాలు ఆధారపడి ఉంటాయి. మీరు యూనివర్సిటీ నుంచి డెబ్ జారీ చేసిన అనుమతి పత్రాన్ని తీసుకొని భద్రపర్చుకోండి. భవిష్యత్తులో ఏదైనా ఇంటర్వ్యూలో అవసరం అయితే ఉపయోగపడవచ్చు. మీరు ప్రస్తుతం చదువుతున్న ఆన్‌లైన్ ఎంఏతో పీహెచ్‌డీ, ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లతో పాటు అన్ని పోటీ పరీక్షలకూ అర్హులవుతారు. జాతీయ విద్యావిధానం పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చాక రెగ్యులర్, డిస్టెన్స్, ఆన్‌లైన్ డిగ్రీలు అన్నింటికీ ఒకే రకమైన గుర్తింపు ఉండే అవకాశాలు ఉంటాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

హైదరాబాద్‌లో జూనియర్ ఆఫీసర్లు

ప్రభుత్వ సంస్థ బామర్ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో రెగ్యులర్/ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన 16 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మేనేజర్ (సేల్స్): 01
- అసిస్టెంట్ మేనేజర్: 02
- ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్ (ట్రావెల్స్): 11
- జూనియర్ ఆఫీసర్ (కమర్షియల్): 01
- జూనియర్ ఆఫీసర్ (ఫారెక్స్): 01

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ/ఎంబీఏ/గ్రాడ్యుయేట్ ఇంజినీర్ **దరఖాస్తులకు చివరి తేదీ:** 01-03-2024 **విధుల నిర్వహణ:** దిల్లీ, కోల్‌కతా **వెబ్‌సైట్:** www.balmerlawrie.com/pages/currentopening

ఇర్కాన్‌లో ఫైనాన్స్ అసిస్టెంట్‌లు

న్యూదిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (ఇర్కాన్)... ఒప్పంద ప్రాతిపదికన 11 ఫైనాన్స్ అసిస్టెంట్ పోస్టులు భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **అర్హత:** బీకాం/ ఎంకాం/ సీఏ(ఇంటర్)/సీఎంఏ(ఇంటర్)తో పాటు 4 ఏళ్ల అకౌంటింగ్, ఫైనాన్స్, టాక్సేషన్, ఫైలింగ్ ఆఫ్ రిటర్న్ తదితర విభాగాల్లో పని అనుభవం. **వయసు:** 35 ఏళ్లు మించరాదు. **వేతనం:** నెలకు రూ.45,000. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆఫ్‌లైన్ దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** జేజీఎం/ హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకేత్, దిల్లీ. **వెబ్‌సైట్:** www.ircon.org/index.php?lang=en

వాక్-ఇన్

ముజఫర్‌పూర్‌లో మెడికల్ ఆఫీసర్‌లు

హోమి భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్, ముజఫర్‌పూర్ - తాత్కాలిక ప్రాతిపదికన 5 మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో ఎంబీబీఎస్ డిగ్రీ. **వేతనం:** నెలకు రూ. 84,000 **వయసు:** 45 సంవత్సరాలు. **ఇంటర్వ్యూ తేదీ:** 29-02-2024 **ప్రదేశం:** హోమి భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్. **వెబ్‌సైట్:** https://tmc.gov.in/m_events/Events/JobVacancies

---

ఏఐ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో టెక్నీషియన్ కొలువులు

దిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, రిపేరింగ్ సంస్థ.. ఏఐ ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్ఎల్) 100 ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అభ్యర్థులను ముందు 5 ఏళ్ల ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ కింద ఉద్యోగంలోకి తీసుకుంటారు. పనితీరు, సంస్థ అవసరాల ఆధారంగా కాంట్రాక్ట్‌ను మరో 5 ఏళ్ల పాటు పొడిగించే అవకాశం ఉంటుంది. దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో పంపాలి.

స్కిల్/ ట్రేడ్ టెస్ట్, టెక్నికల్ అసెస్‌మెంట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- అర్హతలు, అనుభవం ఆధారంగా అభ్యర్థుల షార్ట్‌లిస్ట్‌ను తయారుచేసి ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూ తేదీ, సమయాలను అభ్యర్థుల ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లకు తెలియజేస్తారు.
- స్కిల్/ ట్రేడ్ టెస్ట్ సమయంలో అభ్యర్థుల ఒరిజినల్ డాక్యుమెంట్లను పరిశీలిస్తారు.
- గవర్నమెంట్/ సెమీ-గవర్నమెంట్/ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే అభ్యర్థులు ప్రొపర్ ఛానల్ ద్వారా దరఖాస్తు చేయాలి. లేదా 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను సమర్పించాలి.
- స్కిల్/ ట్రేడ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఏ పోస్టుకు ఎవరు అర్హులు?

1. **ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్:** ఏఎంఈ డిప్లొమా/ సర్టిఫికెట్ ఇన్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ (మెకానికల్) ఇంజినీరింగ్ 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు ఉండాలి. **లేదా** మెకానికల్/ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిప్లొమా 60 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు సరిపోతాయి.
- ఏడాది పని అనుభవం తప్పనిసరి.

2. **ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్ (ఏవియానిక్స్/ ఎలక్ట్రికల్/ ఇన్‌స్ట్రుమెంటల్/ రేడియో):** ఏఎంఈ డిప్లొమా/ సర్టిఫికెట్ ఇన్ ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ (ఏవియానిక్స్) జనరల్ అభ్యర్థులు 60 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో పాసవ్వాలి. లేదా ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ టెలికమ్యూనికేషన్/ రేడియో/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ డిప్లొమా జనరల్ అభ్యర్థులు 60 శాతం, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో పాసవ్వాలి.

3. **టెక్నీషియన్– ఫిట్టర్/ షీట్ మెటల్, కార్పెంటర్, వెల్డర్:** సంబంధిత విభాగంలో ఐటీఐ పూర్తి చేయాలి. 2 ఏళ్ల పని అనుభవం ఉండాలి.

4. **టెక్నీషియన్ – ఎక్స్‌రే/ ఎన్‌డీటీ:** బీఎస్సీ (ఫిజిక్స్) లేదా డిప్లొమా ఇన్ మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ లేదా బీటెక్ ఇన్ మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పాసవ్వాలి.

01.02.2024 నాటికి జనరల్/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల వయసు 35 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో ఓబీసీలకు 3 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్ల సడలింపు ఉంటుంది. ఎక్స్ - సర్వీస్‌మెన్‌కు ప్రభుత్వ తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి. జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ. 1000. దీన్ని ఆర్‌టీజీఎస్/ ఎన్ఈఎఫ్‌టీ ద్వారా చెల్లించాలి.

- సంస్థ వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ ప్రింట్ అవుట్ తీసుకుని పూరించాలి. దానికి సంబంధిత డాక్యుమెంట్లను జతచేసి ఆఫ్‌లైన్‌లో పంపాలి.
- ఇంటర్వ్యూకు హాజరయ్యే ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రెండో తరగతి ప్రయాణ ఛార్జీలను చెల్లిస్తారు.
- ఎంపికైన అభ్యర్థులను దిల్లీతోపాటు దేశంలోని ఏఐఈఎస్ఎల్ కార్యాల